# కళాఖండాల ఊసట్లు



వెంకటేశం! మనవాళ్ళు వట్టి వెధవాయిలోయ్! అందుకనే మనవాడు ప్రతివాడూ ప్రతి రెండవవాడినీ వెధవాయ అంటాడు. అది మనకు ఉగ్గుపాలతో పెట్టిన విద్దె. ఎదుటపడి ఆ మాటనిందికి దమ్ముల్చాలకపోతే ఏదో గుట్టుగా సంధ్యావందనం చెప్పుకుంటున్నట్టు లోపలనే అనుకుంటాడు. కాకపోతే--నక్క పుట్టి మూడాదివారాలు కాలేదన్నట్లు ఆ సత్రకాయగాడు సత్యజిత్రాయి ఏంవంత పొడిచేశాడని వాడికలా ఒఖ్ఖ లాగ బ్రహ్మరథం పట్టిస్తున్నారూ అని. వాడు పేల్చినట్టి ప్రజ్ఞ, వాడు వెలిగించిన బ్రహ్మవిద్దె యేవింటీ అని. ముందూ వెనకా పెద్దంత్రం చిన్నంత్రం లేకుండా అడ్డమైనవాడూ ఎగబడి వాణ్ణి తెగ పొగిడెయ్యడమే. ఆపాటి ప్రతాపం ఈపట్టైన గొడ్డుపోయిందా.

---

గిరీశం లెక్చర్లు

మాస్టరు గారు ప్లేటు ఫిరాయిస్తున్నారనుకోకు. ఇంటర్నేషనల్ సబ్జెక్టు మీద లెక్చరిచ్చినపుడు బంగాళీవాడు పొడిచేసేదేమీఁ ఉండరాదు. దేశవాళీ జనాభా గురించి మాట్లాడినప్పుడే బంగాళీవాడి ప్రజ్ఞను మెచ్చుకు మనం అక్షింతలేసుకోవాలి తప్ప. ఇందులోమటుకు అందరం సగోత్రీకులమేఁ. అంతే తప్ప ఈ సత్యజిత్రాయంటే నాకు పగనుకునేవు--నాకంతా సమానవేఁ. యే రాయైతేనేం తల బద్దలు కొట్టుకోడానికన్నారు.

ఇంతకీ చెప్పొచ్చినముక్క ఆ పథేర్ పాంచాలీని వాడు తీశాడు. నేను తియ్యలేదు. అంతేగదా తేడా? ఇలా బాజాలు వాయించిపొద్దస్తమానం యెవర్నులు గుప్పిస్తారని వాగ్దానమిస్తే నేను తెల్లవారేసరికల్లా అరడజను కళాఖండా ల్లాగవతల పడేస్తాను.

అసలు కళాఖండాలనగా ఏమిటోయ్--డబ్బురాని పిక్చర్లు .... అంతే కదా. అసలే డబ్బులు గిట్టక నెత్తిన చెంగేసుకు పోయేవాడి బోడిగుండు మీదికి మల్లెచెండులా ఈ పేరు తగిలిస్తారు--మరెప్పుడూ ఇలాంటి ఓఘాయిత్యప్పన్లు చేయకుమీ అని సున్నితంగా మందలించి, వాడూ నా మాట దొరకబుచ్చుకునే మాటాడుతున్నాడనుకో, మా యింట నాలిగ్గీసుకునే తాటాకుబద్దలు నిండుకున్న రోజున మళ్ళా ఈ సర్కారువాళ్ళ సర్టిఫికెట్టుకోసం కళాఖండవోఁటి తీస్తానని. అలాగ్గాదు బాబ్బాబు నువ్వు తీసి తీరాలి మేం చూసితీరాలి అని కాళ్ళా వేళ్ళా బడితే, తే డబ్బు అని డబాయించొచ్చు.

నేను హలీడేమీద ఇక్కడికొచ్చే ముందేగదోయ్--ఓ కళాఖండం చూసొచ్చాం, నాయుడుగారు తీయించారు. ఎలావుంది గిరీశం గారు డబ్బులేవైనా వొచ్చేనా అన్నాడాయన బిక్క మొహవేఁసి--నువ్వు లేమన్నా జాగర్జేశారాస్వావీఁ అన్నా. అంతేనా అన్నాడు కుప్పకూలిపోయి. అంతే గాక మరేవిటయ్యా, ఇలా మాస్టరుపీసు తియ్యదల్చుకున్నట్టు ఓ ముక్క నా చెవిన పారేస్తే కక్కుర్తిరకం గాకుండా కడితేరా కళాఖండవేఁ తీసి పడేసిపెడుదును గదయ్యా అన్నాను. మరేందారి బాబూ అని ఇదయ్యాడు పాపం.

సరే ఇపుడైనా మించిపోయిందేవీ లేదూ, ఈ పిక్చర్లో డాన్సులూ, కామిక్కు వగైరా డబ్బు వాసనేసేవన్నీ తీసిపారేసి ప్రిస్టేజీ పిక్చరని పబ్లిసిటీ అఘోరించవయ్యా లేపోతే నెక్స్ట్ పిక్చరుకి డిస్ట్రిబ్యూటర్రాడు అని ఓ చిటకా చెప్పొనన్నమాట. పాపం వెర్రిముండావాడు చచ్చి నా కడుపున పుడతానన్నాడు. దీంతరవాద్ది ఈ లాగేసిన భాగాలన్నీ పోగేసి మాస్

పిక్చరు తీసి పెడితే మరిహ నేనీజన్మకి చెప్పులు కుట్టించుకోనక్కర్లేదనిన్నీ, తనే చర్మం కోసి కుట్టించి మరీ దాఖలు చేసుకుంటాననిన్నీ మొర పెట్టుకున్నాడు. వాడు మాటిచ్చాడని మనం జోళ్ళుకొనుక్కోడం మానేస్తే యెలాగ. ఇస్తే గిస్తే రెండు జతలు పడుంటాయి కాబట్టి నువ్వు ఓ కొత్తజోడు--ఫస్టుక్లాను విలేజ్ మేక్ గురుదక్షిణగా అర్పించుకుందుకి సన్నాహాలారంభించవచ్చు. నేను ఎంత మాత్రం అడ్డుపడను.

వెంకటేశం, కొంచె విఁసింటా జరుగు, ఓ కబురు చెబుతా ... చూడు, నేను వెనక్కి తిరిగిజూస్తే బావుండదు గాని, ఈ పక్కన మండపం మీద కూచుని మన కబుర్లాలకిస్తున్న చౌదరిగారు ఇంకా అక్కడే ఉన్నాడా లేచి వెళ్ళి పోయాడా .... అ మరేం లేదు. పట్నంలో ఓ బైస్కోపు కంపిణీలో అయన పావలా వాటా పెడుతున్నాడని విన్నాంలే. నాలాటి వాడిక్కడున్నాడని పోల్చుగోలేక, మళ్ళా డైరెక్టర్ల కోసం వెతుక్కుని డబ్బు తగలేసుకుంటాడన్న జాలి కొద్దీ--నేను బొత్తిగా నివురుగప్పిన నిప్పులాటి వాణ్ణయి పోతున్నానుగదోయ్. వెధవది అదే చిక్కు, మోడెస్టీ మహలావు. అ మాట వాళ్ళు పోల్చుకోవాలి. కోటి నదులు ధనుష్కోటిలో నుండగ అన్నాడు త్యాగరాజువారు. అదే గమ్మత్తు. ఒళ్ళో బిడ్డణ్ణెత్తుకుని ఊరంతా వెతికినట్టు. నేనిక్కడే ఉండగా చౌదరిగారు డైరెక్టర్లకోసం వెతకడం ఏవిఁఘునం గనక--తరవాతాయన నాలిక్కరుచుకోలేక ఇదవాలి గదా.

